# ఆకలి మనుషులు

ఉపద్రష్ట సాయి

ఆ మిఠాయి కొట్టు ముందు కాకులు పైకి క్రిందికి ఎగురుతూ యాదగిరి చేతినుంచి ఎగిరిపడుతున్న బూందీ పలుకులను క్రిందపడక ముందే నోటితో పట్టి కసకస నములుతున్నాయి. అలా బూందీ పలుకులను పట్టుకోడానికి ఎగిరినవుడు ఒక దానితో మరొకటి దెబ్బలాడుతూంది. కానీ మళ్ళీ అవే సర్దుకుని క్రిందపడిన వాటిని ముక్కుతో పొడిచి తినేస్తున్నాయి.

ఈ తతంగంలో ఇంచుమించు పాతిక కాకులు ప్రతి రోజూ పాలు పంచుకుంటాయి. యాదగిరి మిఠాయి కొట్టు తెరవగానే ఉదయం 8 గంటలకల్లా అవి అక్కడికి చేరుతాయి. యాదగిరి కొట్టు తెరచి ఒక బూందీ డబ్బాలోంచి గిన్నెడు బూందీ తెచ్చి కొంచెం కొంచెంగా ఆ కాకులకేసి విసురుతాడు. అలా పది నిమిషాలు చేసిన తరువాత కొట్టు ముందర నీళ్ళు చల్లి శుభ్రం చేసి దేవుడి పటాలకు అగరొత్తులు వెలిగించి తరువాత వ్యాపారం మొదలు పెడతాడు.

ఆ రకంగా యాదగిరి విసురుతున్న బూందీకేసి ఆశగా చూస్తున్నాడు పది సంవత్సరాల వయసున్న సత్తిబాబు. వాడి కళ్ళలో బంగారు రంగు బూందీ పలుకులు మెరుస్తున్నాయి. కడుపులో కమిలిపోయిన పేగులు కదులుతున్నాయి. మనసులో బూందీ రుచి మెదలడంతో నాలుకలో లాలాజలం ఊరింది. "ఎంత రుచిగా వుంటుందో..." అనుకున్నాడు సత్తిబాబు. "తనకు కూడా ఒక పిడికెడు బూందీ ఇవ్వకూడదూ" అనుకుని కొంచెం ధైర్యం చేసి "బాబూ! నాకు కూడా కొంచెం ఇవ్వండి బాబూ... ఆకలి..." అన్నాడు గద్గద స్వరంతో.

చింపిరి జుత్తు, మురికి బట్టలు, లోతుకు పోయిన కళ్ళు, అస్తి పంజరంలా వున్న సత్తిబాబును అసహ్యంగా చూసి "పొద్దుటే కనిపించింది... దరిద్రపు మొహం... వెళ్ళెళ్ళు... ఎదవ మొహం..." విసుగ్గా కసురుకున్నాడు యాదగిరి. అయినా సత్తిబాబు వెళ్ళలేదు. మరోసారి యాదగిరిని ప్రాధేయపడ్డాడు. ఈసారి యాదగిరికి కోపం వచ్చింది. "నీ..." అంటూ ఒక్క విసురున వాడి దగ్గరకు వచ్చి మెడ పట్టుకుని అవతలకు లాగాడు. తుపాను తాకిడికి వంగిపోయిన మొక్కలా సత్తిబాబు ముడుచుకుపోయాడు. ఒక వారగా చెట్టు దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.


వాడి కడుపులో ఏదో మంట. నరాలు శబ్దం చేస్తున్నాయి. నిన్న పొద్దుట మస్తాన్ కొట్టు దగ్గర తాగిన 'టీ' తప్ప కడుపులో మరేమీ లేదు.

బస్సు స్టాండులో ఒక ఆసామీ లగేజి మోసి సంపాదించిన రెండు రూపాయలు – తండ్రి వీరయ్య సారా తాగడానికి తీసుకు పోయాడు. తనకు తల్లి అంటూ యాదమ్మ వున్నా లాభం లేదు. అదెక్కడో కూలి పనిచేసి తన తమ్ముళ్ళను, చెల్లెళ్ళను పోషిస్తూంది. తన బిడ్డలను చూసుకునే తీరిక లేదు దానికి.

వీరయ్య రిక్షా తొక్కుతాడు. ఆ డబ్బుతో తాగుతాడు. కనిపించిన ఆడవాళ్లతో జల్సాగా తిరుగుతాడు. తన గురించే ఆలోచిస్తాడు. తన పిల్లలు వున్నారా – చనిపోయారా అని కూడా ఆలోచించడు. సత్తిబాబుకు వేళకింత తిండి పెట్టడానికి ఎవరూ లేరు. వాడిని గాలికి వదిలేశారు కన్నవాళ్ళు. గూడు మర్రి చెట్టు క్రింద. ఆలా చెట్టు దగ్గరే నిలబడి యాదగిరి విసురుతున్న బూందీకేసి చూస్తున్నాడు సత్తిబాబు.

ఈ తతంగమంతా గమనిస్తున్న సీతాపతి "ఆ కుర్రాడి చేతికంత బూందీ ఇస్తే ఏం పోతుంది. అలా కాకులకు వేస్తూ సంతోషంగా వున్న యాదగిరి ఒక్క పసివాడికంత పెడితే చెడిపోతాడా" అనుకున్నాడు. మనిషి కన్నా కాకి ముఖ్యమై పోయిందా? అనుకుంటూ నడిచాడు సీతాపతి.

డయాబిటీస్ వుండడం వల్ల రోజూ కొంత దూరం నడవమని డాక్టరు ఇచ్చిన సలహా మేరకు నడక ప్రారంభించాడు సీతాపతి. అలా నడిచేటప్పుడు అతనికి రకరకాల అనుభవాలు ఎదరవుతాయి. ఆ అనుభవాల్లో ఇదొకటి. "మనిషి నగటు మనిషికన్నా కాకులను... మరికొన్ని జంతువులను ఎక్కువగా ఆరాధిస్తాడు. గౌరవిస్తాడు. కానీ మనిషినెందుకు అలా చూడడు..." ఈ ఆలోచనతో కొంచెం దూరం నడిచాడు. అలా నడుస్తుంటే మరో సంఘటన గుర్తుకు వచ్చింది సీతాపతికి. ఒక రోజు మధ్యాహ్నం తను భోజనం వేళకు షాపు మూసి ఇంటికి వస్తుంటే ఒకరింటి వాకిట్లో ఒక పెద్ద తాంబాళంలో మూడు పెద్ద అన్నం ముద్దలు పెట్టుకుని అటుకేసి వస్తున్న ఆవుకోసం ఎదురు చూస్తూ ఒకతను కనిపించాడు. అవి శార్ధం చేసిన తర్వాత గోవుకు పెట్టే పిండాలు. సరిగ్గా ఆవు వచ్చే సమయానికి ఒక ముసలివాడు అక్కడికి వచ్చి యాచించే విధంగా చెయ్యి జాపాడు. ఆ ముసలివాడు సన్నగా, నల్లగా ఎముకల గూడులా వున్నాడు. కర్రముక్కకు చర్మం తొడుగు వేసినట్లున్నాడు. చేతిలో తాంబాళంలో వున్నది శ్రాద్ధం చేసి గోవుకు పెట్టడానికి తెచ్చిన పిండాలు. కానీ వాటికోసం కళ్ళెదుటే ఒక మనిషి చెయ్యి జాపాడు. అతను ఆకలితో అలమటించే వృద్ధుడు. ఆ పిండాలు ఆ ముసలి వాడికివ్వడమా... లేక గోమాతకు పెట్టడమా అని ఆలోచించిన ఆ వ్యక్తి ఆఖరికి... "పో...పో...నీక్కాదు..." అని ముసలతన్ని తరిమివేశాడు. ఆవు ముందు తాంబాళం పెట్టి భయభక్తులతో నిలబడ్డాడు. ఆవు ఆ పిండాలను తిన్న తరువాత తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. బస్సు స్టాండులో నిలబడిన సీతాపతికి ఈ సంఘటన ఆశ్చర్యం కలిగించలేదు. కారణం శ్రాద్ధం చేసిన తర్వాత పిండదానం చేయడం... గోవులకే అని సీతాపతికి తెలుసు. కానీ, పిండదానం చెయ్యకపోయినా ఆ ముసలాడి చేతిలో ఒక రూపాయో, అర్ధ రూపాయో పెడితే ఆ ఆత్మకూడా సంతోష పడు



తుంది కదా అనుకున్నాడు సీతాపతి.

ఇప్పుడు ఈ పసివాడి చేతిలో కాసిన్ని బూందీ పలుకులు పెట్టి పంపిస్తే ఆ చిన్నవాడి మనసు ఎంత సంతోషించేది – అనుకుంటూ నడుస్తున్న సీతాపతి కళ్ళకు రోడ్డు వారగా వున్న ఒక మునగచెట్టు మీది కాకిని తరుముతున్న ఒక చిన్నపిల్ల కనిపించింది.

'ఉష్... ఉష్...' అంటూ చేతిలోని కర్రతో కాకిని తరుముతున్నా ఆ కాకి కాసేపు పైకి ఎగిరి మళ్ళీ చెట్టు మీదికే వాలి 'కాకా...కాకా' అని అరుస్తూంది.

సీతాపతి అక్కడ ఆగాడు. ఆ చిన్నపిల్ల కాకిని అదే పనిగా ఎందుకు తరుముతూంది అనుకున్నాడు. ఆ మునగ చెట్టు ఒక పూరిగుడిసె ముందున్నది. గుడిసె ఇప్పడో మరి కాసేపట్లోనే పడిపోయేలా వుంది. చేతిలో కర్రతో వున్న ఆ పిల్ల వయసు పది లేక పన్నెండు సంవత్సరాల లోపులో వుంటుంది అని అంచనా వేసుకున్నాడు సీతాపతి.

ఈ రోజు వాకింగ్‌లో కాకులే ఎదురవుతున్నాయి అనుకుంటూ అక్కడే నిలబడి చూస్తున్నాడు. ఆ కాకి పైకి ఎగరడం, మళ్ళీ చెట్టు మీద వాలడం చేస్తూంది. ఎంత సేపూ 'కా...కా...కా...కా...' అని అరుస్తూంది. ఆ పసిపిల్ల కూడా తరమడం మానలేదు. మరో ఐదు నిమిషాలు గడిచాయి.

కాకికీ – ఆ పిల్లకు మధ్య ఇంకా ఘర్షణ జరుగుతూనే వుంది. గుడిసె వాకిట్లో విరిగి పోయిన మట్టి కుండలు రెండున్నాయి. సీతాపతి మెల్లగా ఆ పసిపిల్ల దగ్గరికి వచ్చి "ఆ కాకినెందుకు తరుముతున్నావ్" అని అడిగాడు. ఆ పసిపిల్ల సీతాపతిని విగాదిగా చూసి ... గద్గద స్వరంతో "ఇంట్లో అన్నం వండి నాలుగు రోజులైంది... నాకు ఆకలి... అమ్మ పోయిలో గంజి పెట్టింది..." అంది "మరైతే నేం... ఈ కాకి ఏం చేసింది" అడిగాడు సీతాపతి. "మరేం... ఇంటి దగ్గర కాకి అదే పనిగా అరిస్తే చుట్టాలొస్తార్రు... మరి ఎవరైనా వచ్చేస్తే... ఆ గంజి కూడా మాకు మిగల్దు..." అంది ఆ పసిపిల్ల. ఆ పిల్ల గొంతులో బాధ గూడు కట్టుకుంది. ఆకలి కడుపుకు ఆలోచన కరువా? అనుకున్నాడు సీతాపతి. "అలాగని ఎవరు చెప్పారు నీకు?–" అడిగాడు సీతాపతి. "అమ్మ" అంటూ మళ్ళీ కర్ర పైకెత్తింది ఆ పసిపిల్ల.

ఆ పిల్ల మీద జాలివేసిన సీతాపతి జేబులోంచి రూపాయి నాణెం తీసి ఆ పసి చేతుల్లో పెట్టబోయాడు. "వొద్దొద్దు... అమ్మ తిడుతుంది... అడుక్కోకూడదు" అంది లోపలకి పరుగెడుతూ ఆ పసిపిల్ల. "ఔరా! పేదరికంలో కూడా ఆత్మ గౌరవాన్ని విడిచి పెట్టని ఈ కుటుంబం... 'కొందరు గొప్ప ధనవంతులలో కనిపించని గుణాలను తమలో దాచుకున్న గుడి – వీళ్ళ గుడిసెలో వున్న మానధనులు' అనుకున్నాడు సీతాపతి. వెనక్కు తిరిగి మళ్ళీ నడవడం ప్రారంభించాడు ఇంటికేసి.

అలా నడుస్తూ యాదగిరి మిఠాయి కొట్టు దగ్గరికి రాగానే సీతాపతి కళ్ళకు కనిపించిన దృశ్యం ఆశ్చర్యం



కలిగించింది సీతాపతికి. ఇందాక చెట్టు దగ్గర నిలబడి ఆశగా యాదగిరి చేతిలోని బూందీకేసి చూసిన సత్తిబాబు, కొట్టు ముందర మట్టిలో పడి మిగిలిన బూందీ పలుకులను ఏరుకుని గుప్పెట్లో పోగు వేసుకుంటున్నాడు. ఇప్పుడక్కడ కాకుల్లేవు. సీతాపతి ఆగి చూస్తున్నాడు. మరో ఐదు నిమిషాల తర్వాత సత్తిబాబు పిడికెట్లో కొంచెం బూందీ పోగు చేసుకుని లేచాడు. వాడి మొహం నిండా సంతోషం. సీతాపతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "పాపం! వీడు ఈ బూందీ కోసం ఎంత కష్టపడ్డాడు" అనుకుని "ఒరేయ్!" అని వాడిని పిలిచి ఇందాక మునగ చెట్టు దగ్గర పసిపిల్లకిచ్చిన రూపాయ నాణెం తీసి వాడి చేతిలో పెట్టబోయాడు. సత్తిబాబు! ఆశ్చర్యంగా ఆ నాణాన్ని, సీతాపతిని చూసి "ఎందుకు సార్..." అని అడిగాడు. "ఉత్తినే... ఈ డబ్బుతో బూందీ కొనుక్కో" అన్నాడు సీతాపతి.

"వొద్దు సార్... నే వెళ్తే నన్ను తిడతాడు. మేమంటే అసహ్యంట – మాలాంటోళ్ళు కొట్లోకి వస్తే కష్టమర్లు రారంట – ఓసారి అలా తిట్టాడు" అన్నాడు సత్తిబాబు. ఇది కూడా ఆశ్చర్యం అనిపించలేదు సీతాపతికి.

పెద్ద హోటల్స్‌లో కూడా అంతే. భిక్షగాళ్ళనీ మురికి బట్టలు తొడుక్కున్న వాళ్ళనీ లోపలికి రానీరు. "ఉన్న వాడి చేతిలో వున్న రూపాయకెంత విలువ వుంటుందో, లేని వాడి చేతిలోని రూపాయకూ అంతే విలువ వున్నప్పడు పేదరికం వల్ల మాసిపోయిన రూపం అసహ్యం అవుతుందా. అందువల్ల వాళ్ళను లోపలకి కూడా అనుమతించరా" అనుకున్నాడు సీతాపతి. "సరే నువ్విక్కడే వుండు" అంటూ యాదగిరి కొట్లోకి వెళ్ళి రెండు రూపాయలకు బూందీ కొని తెచ్చి ఆ పొట్లాన్ని సత్తిబాబు చేతిలో పెట్టాడు. అలా పెడుతున్నపుడు వాడి కళ్ళలోకి చూసిన సీతాపతికి ఆ కళ్ళలో కనిపించిన ఆనంద జ్యోతులు... ఏ గుడిలోనూ దేవుడి ముందున్న దీపశిఖల కన్నా ప్రకాశవంతంగా కనిపించాయి. ఆ క్షణం సీతాపతి మనసులో అనిర్వచనీయమైన తృప్తిని మిగిల్చింది.

మనిషి మనిషికి చేసే సహాయంలో ఒక తృప్తి వుంటుందని తెలుసుకున్న సీతాపతి మళ్ళీ నడక ప్రారంభించాడు. రోజూ తను నడిచేటపుడు కనిపించే నగ్నసత్యాలు అతని మనసులో మెదిలాయి మరోసారి.

●